మంచినీటి సమస్య తీరేదెన్నడు?

- నరసాపురంలో నీటి సరఫరాలో లీకేజ్‌ల తంటా
- వేసవిలో సరఫరాకు తయారు కాని ప్రణాళిక

నరసాపురం: పట్టణంలో మంచినీటి సమస్య రోజు రోజుకూ తీవ్రమవుతోంది. మంచినీటి సరఫరాకు సంబంధించి పైప్‌లైన్‌ల లీకేజ్‌ల అంశం సమస్యగా మారింది. పట్టణంలో ప్రతీరోజూ ఏదో ఓ ప్రాంతంలో మంచినీటి పైప్‌లైన్లు లీక్ అవుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాలకు మంచినీటి సరఫరా నిలిచిపోతుంది. ప్రస్తుత వేసవిలో ఈ సమస్య కారణంగా పట్టణ వాసులు మంచినీటికి కటకటలాడుతున్నారు. ఇదే సందర్భంలో వేసవిలో మంచినీటి సరఫరాపై ఇప్పటికీ అధికారులు ప్రణాళిక తయారు చేయలేదు. మరికొన్నిరోజుల్లో కాలువలు కట్టేయబోతున్నారు. మరి ఈ వేసవిలో రెండు పూటలా కుళాయి ద్వారా మంచినీరు అందిస్తారా? లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

లీకేజ్‌లతోనే సమస్య

పైప్‌లైన్స్ వ్యవస్థ సక్రమంగా లేని కారణంగా ప్రజలు గుక్కెడు నీటికోసం కటకటలాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తరచూ పట్టణంలో ఏదో ఒకచోట పైప్‌లైన్స్ లీకేజ్లు ఏర్పడుతున్నాయి. దీంతో లీకేజ్‌లు ఏర్పడ్డ చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా మంచినీటి సరఫరాకు విఘాతం ఏర్పడుతుది. సుమారు 45 ఏళ్ల క్రితం పట్టణంలో మంచినీటి పైప్‌లైన్స్‌ను నిర్మించారు. అయితే పూర్వం వేసిన పైప్‌లు శిథిలమయ్యాయి. తరచూ ఎక్కడ బడితే అక్కడ లీకేజ్‌లు ఏర్పడుతున్నాయి. కాలానుగుణంగా జరిగిన అభివృద్ధిలో భాగంగా, చాలా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొత్త పైప్‌లైన్స్‌ను కూడా పాత వాటికే అనుసంధానం చేశారు. దీంతో లీకేజ్‌లు కారణంగా మొత్తం మంచినీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.


పట్టణంలో భారీ విస్తీర్ణంలో ఉన్న మున్సిపల్ మంచినీటి చెరువు


శివారు వార్డులకు ట్యాంకర్ ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్న దృశ్యం

పాత పైప్‌లు తుప్పు పట్టి ఎక్కడబడితే అక్కడ చిల్లులు పడుతున్నాయి.

సమృద్ధిగా నీరు ఉన్నా..

జిల్లాలో ఎక్కడా లేని విధంగా పట్టణంలో 70 ఎకరాల భారీ విస్తీర్ణంలో మంచినీటి చెరువుంది. మంచినీటి చెరువులో ఎప్పుడూ 586 మిలియన్ లీటర్ల నీరు అందుబాటులో ఉంటుంది. మంచినీటి సరఫరాకు మూడు రిజర్వాయర్లు ఉన్నాయి. మునిసిపల్ లెక్కల ప్రకారం చూసుకుంటే చెరువులో అందుబాటులో ఉన్న నీటిని కాలువలు కట్టేసినా కూడా పట్టణవాసులకు రెండు పూటలా 65 రోజుల పాటు అందించవచ్చు. అయితే పైప్‌లైన్స్ సమస్య కారణంగా పూర్తిస్థాయిలో ప్రజల దాహార్తిని తీర్చేలేని స్థితిలో మున్సిపాల్టీ ఉంది.

అనేక ఆవార్డుల్లో మంచినీటి ఎద్దడి...

పట్టణంలో 6972 గృహ కుళాయి కనెక్షన్లు, 370 పబ్లిక్ కుళాయిలు, 218 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. పైప్‌లైన్‌ల లీకేజ్‌లు కారణంగా రాయిపేట, రుస్తుంబాధ, స్టేషన్‌పేట, చినమామిడిపల్లి, వీవర్స్‌కాలనీ, వైఎస్సార్‌నగర్, నందమూరికాలనీ ప్రాంతాల్లో నీటి ఎద్దడి నెలకొంది. శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పొన్నపల్లి, మాధవాయిపాలెం, చిమామిడిపల్లి ఓఎన్జీసీకాలనీ, జవదాలవారిపేట, లాకుపేట ప్రాంతాలకైతే ఇబ్బందులు ఏర్పడ్డప్పుడు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఒకటే ట్యాంకర్ మున్సిపాలిటీకి ఉంది. ఈ వేసవిలో మరిన్ని అద్దె ట్యాంకులు పెడతారా? లేదా? అనేది తెలియని పరిస్థితి. ఇప్పటి వరకూ మున్సిపల్ అధికారులు వేసవిలో మంచినీటి సరఫరాపై ప్రణాళిక తయారు చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అటకెక్కిన రూ 81 కోట్ల ప్రాజెక్ట్..

రూ.81 కోట్లతో పట్టణంలో పైప్‌లైన్స్ వ్యవస్థ ప్రక్షాళనకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మున్సిపాలిటీకి స్పెషల్ ప్రాజెక్ట్ మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్ట్ అటకెక్కింది. ఈ ప్రాజెక్ట్ పట్టాక్కితేనే గానీ మున్సిపాలిటీలో మంచినీటిసమస్య తీరే మార్గం కనిపించడంలేదు. మరి ప్రజాప్రతినిధులు, పుర పాలకులు ఈ దిశగా ఏ ప్రయత్నం చేస్తారనేది వేచి చూడాలి.

రెండు పూటలా నీరందిస్తాం



ఎన్ని ఇబ్బందులు వచ్చినా కూడా ప్రతి సంవత్సరం వేసవిలో రెండు పూటలా కుళాయి ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్నాం. ఈ ఏడాది కూడా కచ్చితంగా రెండుపూటలా నీరందిస్తాం. వేసవిలో మంచినీటి సరఫరాపై ప్రణాలక తయారు చేయమని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. పైప్‌లైన్స్ లీకేజ్‌ల సమస్య ఉంది. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన స్పెషల్ ప్రాజెక్ట్ ఆగిపోయింది. ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తయితే మరో 50 ఏళ్ల వరకూ పట్టణంలో మంచినీటి ఇబ్బందులు ఉండవు.

–బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

వైఎస్సార్ సీపీకి యూత్ వింగ్ కీలకం


ముదునూరి ప్రసాదరాజుతో చినిమిల్లి చందు

నరసాపురం: వైఎస్సార్ సీపీకి యూత్ వింగ్ చాలా కీలకమైనదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. ఆదివారం ఆయన నరసాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యూత్‌వింగ్ అధ్యక్షుడుగా నియమితులైన చినిమిల్లి చంద్రశేఖర్(చందు)ను అభినందించారు. నియోజకవర్గంలో పార్టీ యూత్ విభాగాన్ని బలోపేతం చేయాలన్నారు. యువతకు కూటమి నేతలు ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చారని, కానీ ఏ హామీని అమలు చేయలేదని అన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వారికి అండగా నిలబడాలని, ప్రభుత్వం యువత సంక్షేమానికి పాటుపడేలా పోరాటాలు చేయాలని సూచించారు. పార్టీకి యువత వెన్నెముఖ అని, నియోజకవర్గంలో పార్టీ పూర్వ వైభవానికి కృషి చేయాలని సూచించారు. చినిమిల్లి చందు మాట్లాడుతూ తనకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుకు కృతజ్ఞతలు చెప్పారు.

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన ఇరగవరం విద్యార్థి

ఇరగవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.దుర్గామల్లేశ్వరరావు సెంట్రల్ జోన్స్ అథ్లెటిక్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు పాఠశాల హెచ్‌ఎం జి.నాగమణి తెలిపారు. పాలకోడేరు మండలం శృంగవృక్షంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానాలు సాధించినట్లు వివరించారు. ఇంతటి ఘనత సాధించిన విద్యార్థితోపాటు శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.సతీష్‌బాబు, కె.బాబూరావులను హెచ్‌ఎం నాగమణి అభినందించారు.

జాతీయ యోగాసన పోటీలకు చంద్రశేఖర్ ఎంపిక

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బడుగు చంద్రశేఖర్ ఆలిండియా సివిల్ సర్వీసెస్ యోగా చాంపియన్ షిప్ జాతీయ స్థాయి యోగాసన పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు చండీఘడ్‌లో ఈ నెల 5,6,7,8వ తేదీల్లో జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ తరపున చంద్రశేఖర్ ప్రాతినిధ్యం వహించనున్నారు. చంద్రశేఖర్‌ను సర్పంచ్ పిల్లా రాంబాబు, పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ చంద్రశేఖర్ అభినందించారు.

క్లుప్తంగా

సిద్ధాంతంలో అన్నసమారాధన


అన్న సమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: సిద్ధాంతం సాలిపేటలో భద్రకాళీ సమేత వీర భద్రుడు సంబరాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. వీరభద్రుడు ప్రసాదాన్ని స్వీకరించడానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా మెహందీ పోటీలు


ఆచంటలో మెహందీ పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు

పెనుగొండ: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ముందంజ వేయాలని ఆచంట ఎస్సై కేవీ రమణ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆచంట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మహిళలకు, చిన్నారులకు మెహందీ పోటీలు నిర్వహించారు. పోటీలు అనంతరం విజేతలకు బహుమతులను అందించారు. అనంతరం కేవీ రమణ మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ మహిళలు దూసుకు వెళ్తున్నారన్నారు. మహిళల రక్షణకు పటిష్టమైన చట్టాలు అమల్లో ఉన్నాయని, ఆయా చట్టాలపై అవగాహన కల్పించారు.

5 నుంచి దేవునితోట ఆంజనేయుని ఉత్సవాలు

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం దేవునితోటలో ఉన్న అభయాంజనేయ స్వామి ఉత్సవాలు బుధవారం నుంచి 10వ తేదీ వరకూ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, భజనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఆరు దశాబ్దాలుగా ఆంజనేయస్వామి ఉత్సవాలు గ్రామంలో వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు.

జనసేన నేతలపై కార్యకర్తల ఆగ్రహం


అతిథి గృహం వద్ద వాగ్వివాదానికి దిగిన జనసేన కార్యకర్తలు

పాలకొల్లు సెంట్రల్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచనల మేరకు పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశామని, కూటమి నాయకులతో కలిసి పని చేయాలంటే దానికి కూడా సరే అన్నామని అలాంటి మమ్మల్ని పట్టించుకోవడంలో యలమంచిలి, పాలకొల్లు మండలాలకు చెందిన జనసేన కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం పార్టీలో జరిగే సమాచారం కూడా ఇవ్వరా ఇంకెందుకు అలాంటప్పుడు అన్నీ మీరే చేసుకోండి అంటూ యలమంచిలి మండలం, పట్టణంలో కొందరు జనసేన కార్యకర్తలు నాయకులపై అగ్గిమీద గుగ్గిలమయ్యారు. ఆదివారం భీమవరంలోని ఓ వివాహ వేడుకకు హాజరైన రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ పాలకొల్లులోని సినీ నిర్మాత బన్నీ వాసు అతిథి గృహానికి విచ్చేశారు. ఈ సందర్భంలో పట్టణానికి చెందిన జనసేన పార్టీకి సంబంధం లేని ఓ మాజీ శాసన సభ్యుడి సూచనల మేరకు పట్టణంలో ఓ పది మందిని పార్టీలో చేర్చుకోవాలని సిఫార్సు చేయడంతో మనోహర్ సమక్షంలో వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం ముగిసిన వెంటనే మంత్రి మనోహర్ వెళ్లిపోయారు. సోషల్ మీడియా ద్వారా ఈ సమాచారం తెలుసుకున్న జనసేన కార్యకర్తలు అగ్గిమీద గుగ్గిలమయ్యారు. కనీసం ఎవరిని పార్టీలో చేర్చుకుంటున్నారో? కూడా పట్టణ నాయకులకు సమాచారం ఇవ్వరా? అంటూ కొందరు నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై సీనియర్ నాయకులను కలసి ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతరం యలమంచిలి మండలంలో కూడా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడంలేదని జనసేన కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనితో సహనం కోల్పోయిన పార్టీలో ఓ పెద్ద నాయకుడు మీకు సమాచారం ఇవాల్సిన అవసరం లేదు.. మీకు ఎందుకు చెప్పాలి? అని గట్టిగా కేకలు వేయడంతో జనసేన కార్యకర్తలు అవాక్కయ్యారు.

పేకాట శిబిరంపై దాడి

ఇరగవరం: మండలంలోని పెద్దిరెడ్డిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై జానా సతీష్ తెలిపారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో తమ సిబ్బందితో కలిసి దాడి చేసి రూ.15,550 నగదు, నాలుగు మొబైల్స్, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నరసాపురం రూరల్: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా మార్చి నెలాఖరు వరకూ నివారణ టీకాలు వేస్తామని మొగల్తూరు మండల పశు వైద్యురాలు గొట్టుముక్కల నీలిమ అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జాతీయ పశువ్యాధుల నివారణ కార్యకరమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మార్చి 1 నుంచి 30 వరకూ చేపడుతున్నామని పేర్కొన్నారు. వ్యాధి ప్రబలకుండా ఈ టీకాలు ఇచ్చేందుకు కార్యాచరణ తయారు చేశామని, 3 నెలల వయసు పైబడిన పశువులన్నింటికీ ఉచితంగా టీకాలు వేస్తామని స్పష్టం చేశారు. పశువులకు గాలికుంటు వ్యాధి ప్రమాదకరమైందన్నారు. వ్యాధి సోకిన పశువులు మృత్యువాత పడకుండా ఉండాలంటే కచ్చితంగా చికిత్స చేయించాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతే లక్ష్యం

పెనుగొండ: నియోజకవర్గంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ పటిష్టతే లక్ష్యంగా కృషి చేస్తామని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సుంకర సీతారామ్ తెలిపారు. నియోజకవర్గ అనుబంధ కమిటీల నూతన అధ్యక్షులుగా నియమితులైన ఆచంట మండలానికి చెందిన ఎస్సీ సెల్ అధ్యక్షుడు పిల్లి రుద్ర ప్రసాద్, బీసీసెల్ అధ్యక్షుడు మొల్లేటి రామకృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ ఖాసీం, వీవర్స్ సెల్ అధ్యక్షుడు వీరా వీరభద్రం, వాణిజ్య విభాగం అధ్యక్షుడు నంబూరి రాజా, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కుక్కల కిరణ్ కుమార్, వికలాంగుల విభాగం అధ్యక్షుడు చదలవాడ ముత్యాలరావులను ఘనంగా సత్కరించారు. ఆచంట మండలానికి సముచిత స్థానం కల్పించిన మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు, జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాద్‌రాజులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆచంట పట్టణ అధ్యక్షుడు పెచ్చెట్టి సత్యనారాయణ, నాయకులు కోట వెంకటేశ్వరరావు, కోళ్ల రాజారావు, కేతా తాతారావు, పెచ్చెట్టి రామారావు, కాండ్రేగుల కనకేశ్వరరావు, ఆరుపల్లి శ్రీను, తాళ్ల కుమార స్వామి, విశ్వనాథుల సత్యనారాయణ, వడ్లపాటి అంబేడ్కర్, యాళ్ల బాలాజీ, చదలవాడ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఆచంటలో నియోజకవర్గ అనుబంధ కమిటీ నూతన అధ్యక్షులను ఆచంటలో సత్కరిస్తున్న నాయకులు

వైభవంగా పోలేరమ్మ జాతర


మార్టురులో పెద్దవీధిలో పూరిగుడి వద్ద బారులు తీరిన భక్తులు


మార్టేరులో వాసవీమాతను రథంపై ఉంచి సారెతో వస్తున్న ఆర్యవైశ్యులు

పెనుమంట్ర: మార్టేరు గున్నమ్మచెరువుగట్టుపై ఉన్న గ్రామదేవత పోలేరమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్దవీధిలో పూరిగుడి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. డప్పువాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో శ్రీవాసవీమాతను పూలరథంపై ఉంచి గ్రామోత్సవం చేశారు. సారె కావిళ్లతో పూరిగుడికి వెళ్లి పోలేరమ్మ అమ్మవారికి ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం తెల్లవారు జామున అమ్మవారిని ఊరేగింపుగా గున్నము చెరువుగట్టున ఉన్న అమ్మవారి ఆలయానికి తీసుకువెళ్లి అమ్మవారిని ఆలయంలో ఉంచి మొక్కులు చెల్లించుకుంటారు. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ జాతర కోసం బంధువులు పెద్ద సంఖ్యలో రావడంతో సందడి నెలకొంది.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

యలమంచిలి: చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవాని యాదవ్ డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం యలమంచిలి మండల సమావేశం ఆదివారం సాయంత్రం కట్టుపాలెం గ్రామంలో నిర్వహించారు. సంఘ నియోజకవర్గ అధ్యక్షులు పొన్నమండ ముత్యాలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని, జనగణనలో కుల గణన చేయాలని, బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు ఏబీ,సీ,డీలుగా విభజించాలని, మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ తీర్మానం చేశారు. సంఘ నియోజకవర్గ అధ్యక్షులు పొన్నమండ ముత్యాలరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని పార్టీలు, అన్ని కులాలు, అన్ని మతాలకు చెందిన వారిని గుర్తించి పదవులు ఇస్తామన్నారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘ యలమంచిలి మండల ప్రధాన కార్యదర్శిగా గుబ్బల వెంకన్నబాబు, కార్మిక విభాగ అధ్యక్షులుగా కర్రే యేసురత్నం, సోషల్ మీడియా కన్వీనర్‌గా నక్కా సత్యనారాయణలను నియమిస్తూ నియమాక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు మామిడిశెట్టి చిట్టిబాబు, అనచంద్ర ప్రసాద్, కురెళ్ల మాణిక్యాలరావు, కడలి రామకృష్ణ, అద్దంకి భాస్కరరావు, పొన్నమండ శ్రీరాములు, కరుణాయుడు, బాలాజీ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.


కట్టుపాలెం గ్రామంలో నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘ సమావేశంలో పాల్గొన్న నాయకులు

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ ఖర్చులు ఆదా

పోడూరు: పీఎం సూర్యఘర్ యోజన పథకంతో వినియోగదారులు 70 శాతం వరకు తమ విద్యుత్ బిల్లుల ఖర్చులను ఆదా చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. సోలార్ పవర్ సర్వీస్‌లను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా గృహావసర విద్యుత్ వినియోగదారులకు సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటు చేసుకునేందుకు సబ్సిడీని ఇస్తున్నారు. ఒక కిలో వాట్ విద్యుత్ కోసం సోలార్ ప్యానెల్స్ సర్వీసు ఏర్పాటు చేసుకునేందుకు దాదాపుగా రూ.85 వేలు వరకు ఖర్చవుతుంది. దీనికి ప్రభుత్వం సూర్యఘర్ యోజన పథకం ద్వారా రూ.30 వేలు సబ్సిడీ ఇస్తుంది. రెండు కిలోవాట్ల విద్యుత్ కోసం సోలార్ ప్యానెల్స్ సర్వీసు ఏర్పాటు చేసుకునేందుకు దాదాపుగా రూ.1.70 లక్షలు ఖర్చవుతుంది. దీనికి ప్రభుత్వం రూ.60 వేలు సబ్సిడీ ఇస్తుంది. మూడు కిలోవాట్ల సోలార్ సర్వీసుకు రూ.2.30 లక్షలు ఖర్చవుతుంది. దీనికి ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీ ఇస్తుంది. మూడు కిలోవాట్లు ఆపైన ఎన్ని కిలోవాట్ల సర్వీసుకైనా ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రూ.78వేలుగా ఉంది.

గృహావసరాలకు ఉపయోగం

పీఎం సూర్యఘర్ యోజన పథకం కేవలం గృహావసర వినియోగదారులకు(కేటగిరి-1)కు మాత్రమే వర్తిస్తుంది. ఇతర కేటగిరి సర్వీసులకు ఈ పథకం వర్తించదు. అలాగే తెల్ల రేషన్ కార్డు, ఆదాయ పరిమితులతో సంబంధం లేకుండా గృహావసర విద్యుత్ వినియోగదారులందరికీ ఈ పథకం వర్తిస్తుంది. పాలకొల్లు సబ్‌డివిజన్ పరిధిలో పాలకొల్లు సెక్షన్ పరిధిలో సుమారుగా 25,335 పూలపల్లి సెక్షన్ పరిధిలో సుమారుగా 21,265, పోడూరు సెక్షన్ పరిధిలో 19,230, యలమంచిలి సెక్షన్ పరిధిలో సుమారుగా 19,550 గృహావసర సర్వీసులు ఉన్నాయి.


జిన్నూరులో ఒక ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసిన దృశ్యం

విద్యుత్ బిల్లుల ఖర్చు ఆదా

సోలార్‌విద్యుత్ ద్వారా విద్యుత్ బిల్లుల ఖర్చును 70 శాతం వరకు ఆదా చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఒక కిలోవాట్ సోలార్ పవర్ సర్వీస్ ద్వారా రోజుకు 4 యూనిట్లు, ఒక నెలకు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రెండు కిలోవాట్ల సర్వీసు ద్వారా రోజుకు 8 యూనిట్లు, నెలకు 240 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. మూడు కిలోవాట్ల సర్వీసు ద్వారా రోజుకు12 యూనిట్లు, నెలకు 360 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. సూర్యఘర్ యోజన పథకం ద్వారా సోలార్ పవర్ సర్వీస్ ఏర్పాటుచేసుకున్న వినియోదారులు తమ విద్యుత్ ఖర్చులను ఆదా చేసుకోవడమే కాకుండా తమ మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌లకు విద్యుత్‌ను విక్రయించవచ్చు. ఉదాహరణకు ఒక సోలార్ పవర్ సర్వీసు ద్వారా నెలకు 360 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయితే అందులో వినియోగదారుడు 200 యూనిట్లు మాత్రమే వాడుకుంటే మిగతా 160 యూనిట్ల విద్యుత్ గ్రిడ్‌కు వెళుతుంది. ఇలా గ్రిడ్‌కు వెళ్లిన విద్యుత్‌కు యూనిట్‌కు రూ.2.05 చొప్పున విద్యుత్‌శాఖ వినియోదారుడికి చెల్లిస్తుంది. ఈ సొమ్ము ప్రతి మూడు నెలలకు వినియోదారుల బ్యాంకుఖాతాలో జమవుతుంది.

అపోహలు సరికాదు..

సోలార్ పవర్ సర్వీసు ద్వారా వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు. వర్షాకాలంలో నాలుగైదు రోజులు ముసురు ఉన్నా కనీసం 30 నుంచి 50 శాతం విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. సోలార్ పవర్ సర్వీసు ప్యానెల్స్ ద్వారా నేరుగా సూర్యర్శ్మి లేకున్నా కేవలం వెలుతురు ద్వారా విద్యుత్ తయారవుతుందని వివరిస్తున్నారు. కోతులు, పక్షుల వల్ల ప్యానెల్స్‌కు ఎటువంటి నష్టం ఉండదని, వినియోగదారులు ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సోలార్ పవర్ సర్వీసు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఇప్పటివరకు 590 దరఖాస్తులు



సూర్య ఘర్ యోజన పథకంలో సోలార్ సర్వీసులు ఏర్పాటు చేసుకునేందుకు గ్రామంలోని లైన్‌మెన్‌ను గానీ, పోడూరు సబ్‌స్టేషన్‌లో గానీ సంప్రదించాలి. వినియోగదారులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు కరెంటు బిల్లు జిరాక్స్, ఆధార్ జిరాక్స్, బ్యాంక్ అక్కౌంట్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోను అందజేయాలి. ఇప్పటివరకు మండలవ్యాప్తంగా 590 దరఖాస్తులు అందాయి.

– సత్యనారాయణ, ఎలక్ట్రికల్ ఏఈ

నీటి ఎద్దడిపై రైతుల నిరసన

అత్తిలి: ఈడూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఆవదొడ్డి ఆయకట్టు ప్రాంతానికి దాళ్వా పంటకు సాగునీరు అందక వరి చేలు బీటలు వారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఆ ప్రాంత రైతులు చేలల్లో దిగి నెరలు తీసిన చేలల్లో దుబ్బులు తీసి సాగునీరు అందించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అధిక వర్షాలు, వరదల కారణంగా రెండు పర్యాయాలు సార్వా పంట పూర్తిగా పాడై నష్టం వాటిల్లిందన్నారు. మూడో దఫా పంట ఊడ్చు లేక 400 ఎకరాలు వదిలేశామని, నష్టపోయిన రైతులకు ఎటువంటి పరిహారం ప్రభుత్వం అందించలేదని వాపోయారు. ప్రస్తుత దాళ్వా సాగులో ఎకరాకు రూ.35 వేలు పెట్టుబడి పెట్టామని, తీరా పంట ఈనిక దశకు వచ్చే సరికి సాగునీరు అందక వరి చేలు బీటలు వారుతున్నాయని, దీంతో పంట దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పంట సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చికెన్, కోడి గుడ్డుపై అపోహలొద్దు

తణుకు అర్బన్: కోళ్లలో ఎటువంటి వైరస్ లేదని నిస్సందేహంగా చికెన్, కోడి గుడ్లు ఆహారంగా తీసుకోవచ్చని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. వేల్పూరు ఎన్టీఆర్ పార్కులో ఆదివారం పౌల్ట్రీ ఫెడరేషన్ వేల్పూరు జోన్ రైతులు నిర్వహించిన చికెన్ మేళాలో ఆయన మాట్లాడారు. చికెన్, కోడి గుడ్లను ఉడికించి వండుకుని తినడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. వేల్పూరులో రెడ్‌జోన్ మినహా ఎక్కడా కూడా చికెన్, కోడి గుడ్ల అమ్మకాలపై ఎటువంటి ఆంక్షలు లేవని నిరభ్యంతరగా ఆహారంగా తీసుకోవచ్చని సూచించారు. వైరస్ పౌల్ట్రీ రంగాన్ని తీవ్రంగా కుదిపేసిందని చికెన్, కోడి గుడ్ల అనుసంధానంగా నడిచే వ్యాపారాలు ఇబ్బందుల్లో పడ్డాయన్నారు. ఈ సందర్భంగా చికెన్ వంటకాలతో పాటు కోడి గుడ్లను పశు సంవర్ధకశాఖ అధికారులు, రైతులు తిన్నారు. అనంతరం చికెన్ మేళాకు హాజరైన ప్రజలకు చికెన్ వంటకాలను ఉచితంగా అందజేశారు. మండల పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ శంకర్ భావన్నారాయణ, పౌల్ట్రీ రైతులు పెనుమర్తి మోహన్, జీవీఆర్ చౌదరి, పి.రంగారావు, పి.సారథి పాల్గొన్నారు.

సాక్షి
WALK IN INTERVIEW
ON 03-03-2025 AT 10.00 AM
సాక్షి దినపత్రిక సందు
నరసాపురంలో ప్రకటనలు సేకరించుటకు
ఆఫీసర్స్ / రిప్రజెంటేటివ్స్ కావలెను
విద్యార్హత : డిగ్రీ,వయస్సు :19–35 సం॥లు
అనుభవం : ప్రకటనల సేకరణలో లేదా ఏదైనా సేల్స్ / మార్కెటింగ్‌లో అనుభవం వుండాలి.
జీతం : ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా,విద్యార్హత సర్టిఫికేట్స్, జిరాక్స్ కాపీలు మరియు 2 లేటెస్ట్ పాస్‌పోర్ట్ ఫొటోలతో సహా
దీ.03-03-2025 సోమవారం ఉదయం 10.00 గంటల నుండి ఇంటర్వ్యూలకు హాజరు కాగలరు.
You can Send your resumes through E-mail: tpgadvt@gmail.com
భీమవరం : సాక్షి ఆఫీస్, అస్త్రం బిల్డింగ్, వీరభద్ర స్వామి గుడి వద్ద, భీమవరం, ప.గో.జిల్లా.